వృత్తి నైపుణ్య శిక్షణా కోర్సులకు ఆహ్వానం

శంషాబాద్: జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలోని కోర్సుల్లో చేరడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, టైలరింగ్ కోర్సుల్లో చేరేవారు కనీసం ఏడో తరగతి చదివుండాలన్నారు. ఎంఎస్ఆఫీస్ కోర్సుల్లో చేరాలనుకునే వారు పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఆగస్టు 1 నుంచి శిక్షణా తరగతులు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఆశక్తిగల అభ్యర్థులు 9440788502 నెంబరును సంప్రదించాలన్నారు.

బోనాలకు బందోబస్తు ఏర్పాటు చేయాలని వినతి

శంషాబాద్: ఈ నెల 21న జరిగే బోనాల ఉత్సవాల సందర్భంగా ఆది, సోమవారాల్లో పోలీసు బందోబస్తుతో పాటు ఆయా ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేయాలని శంషాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ ఏసీపీ శ్రీనివాస్‌రావుకు వినతి పత్రం అందజేశారు. సిద్దాంతి కట్టమైసమ్మ తదితర ఆలయాల వద్ద భారీ ఎత్తున బోనాలతో భక్తులు వస్తారని వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాతీయరహదారిపై బారికేడ్లను ఏర్పాటు చేయాల్సి అవసరముందన్నారు. అదే విధంగా బోనాలు, ఊరేగింపుల సమయాల్లో బందోబస్తును కూడా ఏర్పాటు చేయాలని కోరారు.

'అమ్మ మాట అంగన్ వాడీ బడిబాట' కార్యక్రమం



బాబుల్‌రెడ్డినగర్: అంగన్ వాడీ టీచర్ అనిత మంగళవారం అమ్మ మాట అంగన్ వాడీ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. బాబుల్‌రెడ్డినగర్ ప్రాంతంలో ఇంటింటికి తిరుగుతూ తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. 2.5 సంవత్సరాల నుంచి 5 సంవత్సరాల వయస్సు గల చిన్నారులను అంగన్ వాడి కేంద్రంలో చేర్పించి విద్యాభ్యాసం చేయించాలని చిన్నారుల తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో అనిత, మాధవి, ఏఎన్ఎం ప్రేమాదేవి, సంగీత, రేణుక, సరిత, మంగ, లక్ష్మి, హేమలత పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



ప్రశాంత్‌నగర్ కాలనీలో మహిళలకు మొక్కలు పంపిణీ చేస్తున్న మేయర్ లతాప్రేమ్‌గౌడ్

బండ్లగూడ: కార్పొరేషన్ పరిధిలోని 17వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీలో వన మహోత్సవ కార్యక్రమాన్ని జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై కాలనీలలోని మహిళలకు మొక్కలను పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణకు, మానవాళి మనుగడకు మొక్కలు ఎంతో దోహదపడతాయన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి ఎదుగుదలకు తోడ్పడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు కుసుమ, వసంత, సంతోషి, అనిత, జాన్సీ పాల్గొన్నారు

ప్రతి ఇంట్లో మొక్కలు పెంచాలి



మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేటలో మంగళవారం ఇంటింటికి తిరిగి వైస్ చైర్మెన్ జి.విజయ్‌బాబుతో కలిసి మొక్కలను పంపిణీ చేశారు. ప్రతి ఇంటికి వారు పెంచగలిగే మొక్కలను ఉచితంగా అందిస్తామని అన్నారు. ప్రతి వార్డులోని రోడ్ల పక్కన, డివైడర్‌ల పైన, ఖాళీ స్థలాల్లో వీలైనన్ని మొక్కలను పెంచేందుకు మున్సిపాలిటీ నుంచి ఇప్పటికే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రతి ఇంట్లో వీలైనన్ని ఎక్కువ మొక్కలను నాటాలని నార్సింగి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్, కమీషనర్ టి.ప్రవీణ్ కుమార్‌రెడ్డిలు అన్నారు. 4వ వార్డు కౌన్సిలర్ దుర్గేష్ యాదవ్, డీఈ నరసింహరాజు పాల్గొన్నారు.

రెండోరోజుకు చేరిన మధ్యాహ్నభోజన కార్మికుల రిలే దీక్ష



రిలే దీక్ష చేపడుతున్న మధ్యాహ్నం భోజనం కార్మికులు

శంషాబాద్: సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్నం భోజన కార్మికులు చేస్తున్న రిలే దీక్ష రెండో రోజుకు చేరింది. మంగళవారం కార్మికులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసనలు తెలిపారు. మధ్యాహ్నం భోజనం కార్మికుల ఐదు నెలల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని ప్రైవేటు సంస్థ అక్షయ పాత్రకు అప్పగించేందుకు చేస్తున్న ప్రయత్నాన్ని ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించేంత వరకు పోరాటం చేస్తామన్నారు.

ఔటర్‌పై కంటెయినర్ బీభత్సం



శంషాబాద్ రూరల్: లారీ డ్రైవర్ తాగిన మత్తులో కంటెయినర్‌ను ఓఆర్ఆర్ డివైడర్‌ను ఢీకొట్టిన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. తుక్కుగూడ నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న కంటెయినర్ ఆదివారం అర్ధరాత్రి అదుపుతప్పి పెద్ద గోల్కొండ సమీపంలో ఔటర్ రింగు రోడ్డుపై డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలు కాలేదు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. డ్రైవర్ సూర్యపాల్‌కు డ్రంకెన్ డ్రైవ్ పరీక్ష నిర్వహించగా మద్యంమత్తులో ఉన్నట్లు తేలింది.

రోడ్లు ఛిద్రం.. జర్నీ జర భద్రం..

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



ఈవీవీ కాలనీ ప్రవేశంలో ఏర్పడిన గుంతలు

మణికొండ: రోడ్లన్నీ గోతులమయం, బురదమయంగా మారడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని వాహనదారులు వాపోతున్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ఏ రోడ్లు చూసిన గుంతలుగా మారాయి. మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత రోడ్లు జలమండలి, కేబుల్, డ్రైనేజీ తదితర పనుల నిమిత్తం ఇటీవల కాలంలో తవ్వకాలు చేపట్టారు. అలాంటి పనులను రోడ్లు వేయకముందు చేపట్టాల్సి ఉన్నా ఆ విషయాన్ని పట్టించుకోకుండా ముందుగా రోడ్లను వేశారు.

అనంతరం వాటిని అనేక పనుల నిమిత్తం తవ్వకాలు చేపట్టడంతో వర్షాకాలంలో ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి. వరద నీటిలో ఎక్కడ గుంత ఉందో తెలియక ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అలకాపూర్ చింత చెట్టు చౌరస్తా వద్ద ప్రతి రోజు పదుల సంఖ్యలో ప్రజలు కింద పడి గాయాల పాలవుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తీర్మానాలకే పరిమితం..

ఈవీవీ కాలనీ ప్రవేశం, గోల్డెన్ టెంపుల్. లక్ష్మీప్రియనగర్ కాలనీలలో రోడ్లు బురదమయంగా మారాయి. వాటికి కొత్త రోడ్లను వేస్తామని నెలల క్రితం అధికారులు, ప్రజాప్రతినిధులు హామీలు ఇచ్చినా వాటిని పట్టించుకునే నాథుడే లేకుండా పోయారని వారు వాపోతున్నారు. ఇటీవల మున్సిపల్ సమావేశాల్లో ఆయా పనులు చేపట్టేందుకు తీర్మానాలు చేసినా ఒక్క పనిని చేపట్టిన పాపాన పోవటం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కౌన్సిలర్లు చేసిన తీర్మానాలకు అనుగుణంగా ప్రజలకు ఇబ్బందికరంగా మారిన రోడ్ల మరమ్మతులు, కొత్త రోడ్ల నిర్మాణం చేపట్టాల్సిన ఇంజనీరింగ్ అధికారులు పట్టించుకోకపోవటంతోనే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వారు పేర్కొన్నారు. ఈ సమస్యలపై పలుమార్లు మున్సిపల్ కమిషనర్, చైర్మన్ దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ఫలితం లేదని ఆరోపిస్తున్నారు.ఉన్నతాధికారులు స్పందించకుంటే జిల్లా కలెక్టర్, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి వెళ్లేలా నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరిస్తున్నారు.



చింత చెట్టు సర్కిల్ వద్ద ఇలా..

రౌడీషీటర్లకు ఎస్‌ఓటీ డీసీపీ వార్నింగ్

- ప్రతి ఒక్కరిపై ప్రత్యేక నిఘా
- గంజాయి జోలికి వెళితే పీడీ యాక్ట్
- 92మంది రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లను హెచ్చరిస్తున్న ఎస్ఓటీ పోలీసు అధికారులు

మణికొండ: గంజాయి, డ్రగ్స్ వాడకం, అమ్మటం, భూ కబ్జాలకు పాల్పడితే పీడీ యాక్ట్ నమోదు చేసి అరెస్ట్ చేస్తామని, ప్రతి ఒక్కరిపై ప్రత్యేక నిఘా ఉంటుందని మాదాపూర్ ఎస్ఓటీ డీసీపీ శ్రీనివాస్‌గుప్తా, అదనపు డీసీపీ శ్రీనివాస్‌రెడ్డిలు రౌడీషీటర్లను హెచ్చరించారు. మంగళవారం నార్సింగిలోని ఎస్ఓటీ పోలీస్‌స్టేషన్ వద్ద 92 మంది రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యకళాపాలకు పాల్పడినా వెంటనే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గంజాయి స్మగ్లింగ్‌కు పాల్పడినా, సేవించినా, భూ కబ్జాలు, దుర్మీలు, గ్యాంగ్‌లను మెయింటైన్ చేసి స్థానికంగా ఎలాంటి సంఘ వ్యతిరేక కార్యకళాపాలను నిర్వహించినా ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాదాపూర్ ఎస్ఓటీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో ఆక్రమణల తొలగింపు



ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను తొలగించిన రెవెన్యూ అధికారులు

మణికొండ: గండిపేట మండలం, పుప్పాలగూడ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 324లో పది ఎకరాల కాందీశీకుల భూమి ఉంది. ఎకరం రూ. 50కోట్లకు పైగా పలికే పది ఎకరాల భూమి కబ్జాను రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. కోర్టు ఆదేశాలతో సదరు స్థలాని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. అలాంటి భూమిపై తమకు హక్కులు ఉన్నాయంటూ రెండు రియల్టీ సంస్థలు స్వాధీనానికి యత్నించారు. వారిలో ఒకరు ఏకంగా అందులో కంటైనర్, సెక్యూరిటీ గార్డు గదిని ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకుని సోమవారం నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేయగా మంగళవారం అక్కడికి చేరుకున్న పోలీసులు వాటిని కూలిచ్వేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎస్.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ భూముల ఆక్రమణలను సహించేది లేదని, అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నామన్నారు. రెవెన్యూశాఖ పరంగా గతంలో జరిగిన తప్పులను సరిదిద్ది ప్రభుత్వ భూములను పరిరక్షించామన్నారు. ఎక్కడైనా ప్రభుత్వ భూముల ఆక్రమణ జరుగుతుంటే తమకు వెంటనే సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.


సుందరీకరణ పనుల పరిశీలన




సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న సురేష్‌గౌడ్

బండ్లగూడ: వర్షాకాలం నేపథ్యంలో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సీనియర్ నాయకుడు గోకరి సురేష్‌గౌడ్ అన్నారు. 18వ డివిజన్ కిస్మత్‌పూర్‌లోని ఎర్రకుంటలో జరుగుతున్న సుందరీకరణ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. అనేక నిధులతో ఎర్రకుంట సుందరీకరణ పనులు జరుగుతున్నాయన్నారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఈ పనులు పూర్తయితే ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అనంతరం 18వ డివిజన్‌లోని ఓంనగర్ కాలనీ తదితర కాలనీల్లో విద్యుత్ అధికారులతో కలిసి పర్యటించారు. తరచు విద్యుత్ కోత విధిస్తున్నారని దీంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనేక ప్రాంతాల్లో విద్యుత్ తీగలు వేలాడుతున్నాయన్నారు. చిన్నపాటి వర్షం, గాలికి విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఈ సమస్య తీర్చేందుకు కొత్త సబ్ స్టేషన్ ఏర్పాటు చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ గోపయ్య, డిఈ రత్నకుమార్, ఏడీఈ సత్యనారాయణ, ఏఈ శ్రీనివాస్, లైన్ ఇన్‌స్పెక్టర్ బాబురావు, కృష్ణ పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి





శంషాబాద్: పట్టణంలోని రవీంద్రభారతి పాఠశాలలో మంగళవారం జరిగిన బ్యాడ్జెస్ ప్రధానోత్సవ కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ అధికారి ప్రియాంక్ తివారి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థి నాయకులకు బ్యాడ్జిలను ప్రదానం చేశారు. విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని అన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణ, సమాజం పట్ల మంచి అవగాహనకు ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు.

అంబేడ్కర్ అభయహస్తం అమలుకు వినతి



శంషాబాద్: ఎస్సీ, ఎస్టీ యువతకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అంబేడ్కర్ అభయ హస్తం పథకం నుంచి రూ. 12 లక్షల రూపాయలు ఇచ్చే పథకాన్ని వెంటనే ప్రారంభించాలని తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు లక్ష్మీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతంకు ఆయన వినతి పత్రాన్ని అందజేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దళిత యువతకు చేయూతనందించే పథకాన్ని సత్వరమే అమలు చేయాలని కోరారు. వినతి పై ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

గుర్రపు డెక్క నివారణకు చర్యలు



గుర్రపు డెక్కలను పరిశీలిస్తున్న ఎంటమాలజీ అధికారులు

రాజేంద్రనగర్: అత్తాపూర్ డివిజన్ పరిధిలోని మూసి నదిలో పేరుకుపోయిన గుర్రపు డెక్కలను మంగళవారం ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ అంజయ్య గౌడ్ అధికారులతో కలిసి పరిశీలించారు. గుర్రపు డెక్కల నివారణ పై చర్యలు తీసుకుంటామని అన్నారు. డ్రోన్‌ల ద్వారా యాంటీ లార్వా ఆపరేషన్‌ను యుద్ధ ప్రతిపాదికన చేపడుతామని ఎంటమాలజీ అధికారి నామాల శ్రీనివాస్ తెలిపారు.

నత్తనడకన డ్రైనేజీ పనులు.. ఇబ్బంది పడుతున్న స్థానికులు



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న సీపీఎం పార్టీ నాయకులు

రాజేంద్రనగర్: శివరాంపల్లి ప్రాంతంలో నత్తనడకన కొనసాగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను సీపీఎం పార్టీ మండల కార్యదర్శి కురుమయ్య పార్టీ నాయకులతో, కార్యకర్తలతో కలిసి మంగళవారం పరిశీలించారు. డ్రైనేజీ పనులు నత్తనడకన జరుగుతుండటంతో విద్యార్థులు రాకపోకలు సాగించేందుకు నానాఅగచాట్లు పడుతున్నారన్నారు. పనులను ప్రారంభించి నెలలు గడుస్తున్నా... ఇప్పటి వరకు పనులను పూర్తి చేయకపోవడంతో ప్రజలు ఇక్కట్లకు గురౌతున్నారన్నారు. జీహెచ్ఎంసీ అధికారులు వెంటనే స్పందించాలని, కాంట్రాక్టర్ వేగంగా పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కమిటీ సభ్యులు జీఎం కురుమయ్య, ఎస్.మోహన్ పాల్గొన్నారు.

ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలి



మాట్లాడుతున్న కరుణాకర్‌రెడ్డి

శంషాబాద్: ఎలాంటి ఆంక్షలు, షరతులు లేకుండా రైతులకు రుణమాఫీ చేయాలని శంషాబాద్ పీఏసీఎస్ డైరెక్టర్ రంగారెడ్డి కరుణాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానికంగా రైతులతో కలిసి మాట్లాడారు. రుణమాఫీకి రేషన్‌కార్డును ముడిపెట్టడం తగదన్నారు. రేషన్ కార్డులేని, పాసుపుస్తకాలులేని రైతులు, ఆధార్ తప్పులు, ఆధార్ అనుసంధానం కాని రైతులు కూడా పెద్ద సంఖ్యలోనే ఉన్నారని అన్నారు. రైతులు వ్యవసాయం కోసం సహకార బ్యాంకుల్లో బంగారం తాకట్టుపై తీసుకున్న రుణాలను కూడా ప్రభుత్వం మాఫీ చేయాలని కోరారు. రైతులకు పదుల సంఖ్యలో కొర్రీలు పెట్టడంతో అనేక మంది రైతులు అప్పులతో తీవ్ర ఇబ్బందులు పడాల్సిన దుస్థితి ఏర్పడుతుందన్నారు. ప్రభుత్వం మరోసారి రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని పునరాలోచన చేయాలని ఆయన కోరారు. ప్రభుత్వాంక్షలు అర్హులైన రైతులను కూడా ఇబ్బందులు పెట్టేలా ఉన్నాయన్నారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తా

కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి



సీసీ రోడ్డు పనులను పరిశీలించిన కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి : మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి మంగళవారం మధుబన్ కాలనీ, బాబుల్‌రెడ్డినగర్ పోచమ్మ దేవాలయాల చుట్టు సీసీ రోడ్డు పనులను జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలు పాటించి సీసీ రోడ్లు వేయించాలని జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. బోనాల పండుగను పురస్కరించుకొని అమ్మవారి దేవాలయాలలో భక్తుల సౌకర్యార్థం సీసీ రోడ్డు, ప్యాచ్ వర్క్ పనులను మంజూరు చేయించానని తెలిపారు. ప్రతి సంవత్సరం డివిజన్‌లోని అన్ని దేవాలయాలలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, స్థానిక నాయకులు బుచ్చిరెడ్డి, ఎన్ఎం రెడ్డి, ఎల్వి రెడి, రామకృష్ణ రెడ్డి, దేవాలయం ఉపాధ్యాక్షుడు రాఘవేందర్, కోశాధికారి యం. దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



దోమల నివారణకు లార్వా స్ప్రే పిచికారీ పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ బి.శరత్‌చంద్ర

బండ్లగూడ: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా యాంటీ లార్వా స్ప్రే చేయించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ బి.శరత్‌చంద్ర అధికారులకు సూచించారు. మంగళవారం 18వ డివిజన్‌లోని 60 గజాలు, మాచనపల్లి ఎన్‌క్లేవ్ లలో దోమల లార్వ వృద్ధి చెందకుండా పిచికారి చేయించారు. ఈ పనులను స్వయంగా ఆయన పర్యవేక్షించారు. అనంతరం 18, 19వ డివిజన్‌లో డోర్ టూ డోర్ చెత్త సేకరణ పనులను సైతం పరిశీలించారు. వర్షా కాలంలో డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధులు ప్రభలే ప్రమాదం ఉందని, ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, శానిటరీ జవాన్లు యాదగిరి, నరేందర్, రాము, కామాటీలు వేణుగోపాల్, పవన్‌కళ్యాణ్, సాట్ ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకారోత్సవం



రాజేంద్రనగర్: అత్తాపూర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి కొత్తగా ఎన్నికైన విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకారోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గోల్కొండ మిలటరీ ఏరియా మేజర్ కృష్ణ పాల్గొని విద్యార్థులకు బ్యాడ్జిలను అందజేశారు. ఎస్‌పీఎల్‌గా ఎన్నికైన విద్యార్థులు ప్రమాణ స్వీకారం చేశారు. ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించవచ్చని ప్రిన్సిపాల్ సుధా అన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ ప్రియా మనీష్, కృష్ణ, సుధ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళ మెడలోని బంగారు గొలుసు చోరీ..

రాజేంద్రనగర్: విధులు ముగించుకొని ఇంటికి వెళ్లేందుకు బస్టాపు వద్ద వేచి ఉన్న ఓ నర్సు మెడలోని మూడు తులాల పుస్తెలతాడును చైన్ స్నాచర్లు దొంగలించిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. కిస్మత్‌పూర్ ప్రాంతానికి చెందిన మమత రాజేంద్రనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో నర్సుగా విధులు నిర్వహిస్తుంది. మంగళవారం 8 గంటల ప్రాంతంలో విధులు ముగించుకొని ఇంటికి వెళ్లేందుకు బుద్వేల్ బన్సీలాల్‌నగర్ బస్టాపు వద్దకు వచ్చింది. బస్సు కోసం వేచి ఉన్న మమత మెడలోని మూడు తులాల బంగారు పుస్తెలతాడును గుర్తు తెలియని ఇద్దరు యువకులు తెంపుకొని పక్కనే యూనివర్సిటీ ప్రహరీగోడ దూకి పారిపోయారు. ఘటనలో బాధితురాలి మెడకు గాయం కావడంతో పక్కనే ఉన్న ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. సరిగ్గా ఇదే ప్రాంతంలో గత సంవత్సరం వ్యవధిలోనే ఐదు చైన్ స్నాచింగ్‌లు చోటు చేసుకున్నాయి. ఎలాంటి సీసీ కెమెరాలు లేకపోవడం... చిమ్మ చీకటిగా ఉండటంతో ఇక్కడ సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఒకే వ్యక్తి ఈ సంఘటనలకు పాల్పడుతున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న డీసీపీ శ్రీనివాస్ దర్యాప్తు చేస్తున్నారు.